# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 48 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 09, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు

### - ఐఎండీ హెచ్చరిక

హైదరాబాద్,(నమస్తే ఉదయం): తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం (సెప్టెంబర్ 8) నుంచి తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉంది.ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో సెప్టెంబర్ 08, 09, 10 తేదీల్లో అతి భారీ వర్షాలు పడుతాయని హైదారబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది.తెలంగాణలో మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో పాటు ఉపరితల ఆవర్తన ప్రభావం కొనసాగుతోందని ఐఎండీ వెల్లడించింది.



## ఎవరుపడితే వారు
# జర్నలిస్ట్ అవతారం

- ఏదిపడితే అది యూట్యూబుల్లో ప్రచారం
- అసలు జర్నలిస్టుల్లో ఎవరు మీరే తేల్చండి
- పార్టీ బాకా పత్రికల జర్నలిస్టుల గురించి ఆలోచించాలి
- జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- జవహర్ లాల్ నెహ్రూ సొసైటీకి స్థలం అప్పగింత
- రవీంద్ర భారతి కార్యక్రమంలో పెత్త ఎత్తున జర్నలిస్టుల హాజరు

హైదరాబాద్,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): ఎవరుపడితే వారు జర్నలిస్టులుగా అవతారమెత్తి, జర్నలిస్ట్ వృత్తికే కళంకంగా మారారని, అంటి వారిని దూరం పెట్టాల్సిన బాధ్యత అసలు జర్నలిస్టులపైన ఉందని సిఎం రేవంతం రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు, వారి ప్రయోజనాలకు తాము వ్యతిరేకం కాదని,



అయితే ఎవరు జర్నలిస్టులో తెలియని పరిస్థితి ఇప్పుడు దాపురించిందని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి ఇళ్ల పట్టాల పంపిణీకి సంబంధించిన అధికారిక పత్రాలను ఆదివారం రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అధికారికంగా పట్టా పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... కొంతమంది జర్నలిస్ట్‌లు రాజకీయ పార్టీలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జర్నలిస్ట్‌లు హద్దులు దాటి వ్యవహరించకూడదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జర్నలిస్టు సంఘాల నాయకులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ..కొంతమంది జర్నలిస్టులు చీఫ్ మినిస్టర్‌ను చీప్ మినిస్టర్ అంటూ కుర్చీకు ఉన్న గౌరవం పోగొడుతున్నారు. వ్యక్తి నచ్చక పోవచ్చు వ్యవస్థలో గౌరవప్రదమైన పదవికి విలువ ఇవ్వాలి.

మిగతా.. 2లో



## డేంజర్ జోన్‌లో ఖమ్మం

- మరోమారు మున్నేరుకు వరద హెచ్చరిక

ఖమ్మం,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఖమ్మంలోని మున్నేరుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం ప్రవాహం 16 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 24 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. అధికారులు వరద ప్రభావిత కాలనీల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతం డేంజర్ జోన్‌లో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రికి మళ్లీ వరద వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లన్నీ బ్లాక్ చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మంలోని వరద ప్రాంతాల్లో నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారు. 16వ డివిజన్ దంసాలపురం, తిరుమలాయ పాలెం, రాకాసి తండాలో పరిస్థితులను ఆయన పరిశీలించనున్నారు. వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం చేపట్టిన పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. శనివారం రాత్రి మున్నేరు ముంపు ప్రాంతాల్లో

మిగతా.. 2లో

## తెలంగాణ ఉద్యమంలో
## ప్రజా కవి కాళోజీ స్ఫూర్తి

- బిఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (సెప్టెంబర్ 9) సందర్భంగా వారి సేవలను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. ప్రజాపక్షం నిలిచి ధిక్కారమే జీవితంగా స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మానవతావాది కాళోజీ, అని కేసీఆర్ కొనియాడారు.

పుట్టుక...చావుల మధ్య బతుకంతా తెలంగాణ కోసమే అర్పించిన అక్షర తపస్వి కాళోజీ అని కీర్తించారు.తెలంగాణ


మిగతా.. 2లో



## సురేందర్ రెడ్డిది ముమ్మాటికీ ఆత్మహత్యే

- రుణమాఫీ కాకపోవడం వల్లనే బలవన్మరణం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ

హైదరాబాద్,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్న సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన అంశంపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం చేస్తున్న వంచన, దుర్మార్గ పద్ధతులపై, అన్నదాతల పట్ల ఆవేదనతో మాట్లాడుతున్నాను. నిన్న రైతు సురేందర్ రెడ్డి రుణమాఫీ జరగలేదని ఆత్మహత్య చేసుకున్నారు. మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకున్నాడు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతుల పాలిట యమపాశంగా మారింది. దానికి సాక్ష్యం సురేంద్ రెడ్డి ఆత్మహత్య. ఆయన తన సూసైడ్ నోట్‌లో స్పష్టంగా రాశారు. బ్యాంక్ పాస్ బుక్ మీదనే సూసైడ్ నోట్ రాశారు. నా చావుకు కారణం క్రాప్ లోన్ మాఫీ కాకపోవడం. నా చావుకు కారణం క్రాప్ లోన్ చిచ్చు. సురేందర్ రెడ్డితో పాటు ఆయన తల్లి.. ఇద్దరు ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల రుణమాఫీ కావడం లేదు. ఇద్దరికి క్రాప్ లోన్ ఉంది. రేషన్ కార్డు ఒకటే ఉండడంతో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని అన్నారు. దాంతో తీవ్ర కలత చెంది సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని హరీశ్‌రావు తెలిపారు. ఈ సూసైడ్ నోట్ సాక్షిగా రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.. పంద్రాగస్టు నాడు రుణమాఫీ అయిపోయిందని చెప్పావు..? అయిపోతే సురేందర్ రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు. మీరే చెప్పారు కదా రేషన్ కార్డుతో లింక్ లేదని. రుణమాఫీ గైడ్ లైన్స్ వచ్చిన రోజే అసెంబ్లీలో ప్రెస్ మీట్ పెడితే.. రేషన్ కార్డుతో లింక్ లేదని కొద్ది గంటలకు చెప్పారు. కానీ లింక్ ఉన్నది.. కాబట్టే బ్యాంక్ మేనేజర్లు రేషన్ కార్డు ప్రకారం రుణమాఫీ చేశారు. అందుకే సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతుంది. రుణమాఫీ లబ్దిదారులను ఆంక్షల పేరుతో వేధిస్తున్నవ్. నీవు పన్నిన పన్నాగం రైతుల మెడకు ఉరి తాడైందని మండిపడ్డారు. ఈ 9 నెలల కాలంలోనే 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.




రేవంత్ రెడ్డిని చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నీ పాలన ఎలా ఉందంటే ఎన్నికల ముందు ఒక మాట, కుర్చీ ఎక్కిన తర్వాత ఒక మాట, బ్జడెట్‌లో ఒక మాట, పార్లమెంట్ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ఒక మాట.. పూటకో మాట మాట్లాడుతున్నావ్. పొద్దు తిరుగుడు పువ్వు కంటే వేగంగా మారుతున్నవ్. ఊసరవెల్లులు కూడా నిన్ను చూసి సిగ్గుపడుతున్నాయి. ఎన్నికల ముందు ఏం చెప్పవ్.. అప్పులు తెచ్చుకోండి డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అన్నావ్.. కుటుంబానికి ఒక్కరికే చేస్తా అని చెప్పలేదు కదా..? అని హరీశ్‌రావు నిలదీశారు.

## వరద బాధిత ప్రాంతాల్లో కేంద్రమంత్రుల పర్యటన



- బాధితులకు అండగా ఉంటామని కిషన్ రెడ్డి హామీ
- వరద సమయాల్లో రాజకీయాలు తగవు
- బిఆర్ఎస్‌కు చురకలంటించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): ఖమ్మం జిల్లాలో గత వారం రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. వానలు దంచికొడుతుండటంతో ఖమ్మం జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. వరద కాలనీలను నీరు ముంచెత్తడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డిలు పర్యటించి బాధితులకు అండగా కేంద్ర ప్రభుత్వం ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.... ఇలాంటి విపత్కర సమయంలో రాజకీయాలు ముఖ్యం కాదని.. ప్రజలను కాపాడటమే ముఖ్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తిర్మలాయపాలెం మండలం రాకాసి తండాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధితులను పరామర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా జిల్లాలు జలమయమయ్యాయని చెప్పారు. వరదలకు నష్టపోయిన వారికి అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి మొన్న వ్యవసాయ శాఖ మంత్రి, ఈరోజు కిషన్ రెడ్డి వచ్చి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. కేంద్ర బృందం వచ్చి నష్టాన్ని అంచనా వేసి పంపించాలని కిషన్ రెడ్డి సెక్రటరీకి వరద సాయంపై కీలక ఆదేశాలు జారీ చేశారని అన్నారు.

మిగతా.. 2లో

## చెరువుల ఆక్రమణలపై
# హైడ్రా దూకుడు

- పలుచోట్ల పెద్ద ఎత్తున కూల్చివేతలు

హైదరాబాద్,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిధిలోని ఆక్రమణలను హైడ్రా కూల్చివేసింది. ఈ చెరువు 26 ఎకరాల్లో ఉంది. దీనిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన షెడ్లు, భవనాలను అధికారులు కూల్చివేస్తున్నారు. ఎఫ్‌టీఎల్‌లోని సర్వే నంబర్లు 12, 13, 14, 16లో కబ్జాదారులు

మిగతా.. 2లో






## వరదల నుంచి కోలుకుంటున్న ప్రజలు

- వరదబాధితులకు భారీగా కాంగ్రెస్ సాయం
- రెండునెలల జీతం విరాళంగా ఇవ్వాలని ప్రజాప్రతినిధుల నిర్ణయం

హైదరాబాద్,సెప్టెంబర్8(నమస్తే ఉదయం): ఖమ్మంలో మున్నేరు విలయంతో ఎటుచూసినా విషాద గాథలే..! ఏ వీధిలో తిరగాలన్నా అంతా బురదే..! ఏ ఇంట్లో చూసినా మట్టికొట్టుకున్న వస్తువులు, దుస్తులే..! కొందరికి ఇవీ లేవు. ఆయా ప్రాంతాల్లో ఏ ఇల్లాలిని కదిలించినా కన్నీరే. మున్నేరు ఉగ్రరూపం దాల్చి 36 అడుగుల మేర ప్రవహించడంతో నది తీరాన ఉన్న ప్రాంతాల్లో వేల ఆవాసాలు నీట మునిగాయి. ఇలా ఒకటా రెండా ఎటు చూసినా హృదయాలను కదిలించే దృశ్యాలే!.

మిగతా.. 2లో

## ఝూన్సీమియా గూడ గ్రామాన్ని పంచాయతీగ కొనసాగించండి

**- గుగ్గిళ్ళ లక్ష్మణ్ ముదిరాజ్**

**శంషాబాద్. సెప్టెంబర్ 8,(నమస్తే ఉదయం):**
శంషాబాద్ మండలంలోని ఝూన్సీమియాగూడ గ్రామాన్ని పురపాలక సంఘంలో విలీనం చేయకుండ గ్రామపంచాయతీ గానే కొనసాగించాలని టిఆర్ఎస్ పార్టీ నాయకుడు గుగ్గిళ్ళ లక్ష్మణ్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర శివారు గ్రామపంచాయతీలను పురపాలక సంఘంలో విలీనం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, ఝూన్సీమియా గూడా గ్రామం ఔటర్ రింగ్ రోడ్డు కు బయట ప్రాంతంలో ఉండడంతో పాటు పూర్తి గ్రామీణ వాతావరణం లో ఉన్నదని తెలిపారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న గండిగూడ ఝూన్సీమియా గూడ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలపై ఆర్థిక భారం పెరిగిపోతుందని అన్నారు. పంచాయతీ పరిధిలో అత్యధిక శాతం ప్రజలు రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు ఉన్నారని లక్ష్మణ్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ వాతావరణం లో ఉన్న ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వలన ప్రజలకు ఒరిగేదేమీ లేదని వారిపై టాక్స్ ల భారం అధికమవుతుందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామాలను మాత్రమే మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ప్రజల అభిప్రాయం సేకరించకుండా ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని ప్రజలకు అనుకూలంగా వ్యవహరించాలని సూచించారు.

## సహా సెక్యూరిటీగార్డ్‌కు తోడ్పాటునందించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం సెక్యూరిటీ అధికారులు, గార్డులు

**రాజేంద్రనగర్ సెప్టెంబర్ 08(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సహా గార్డుకు తోడ్పాటు అందించారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు కుటుంబంలో ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారికీ మేమున్నామని మనో



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ సెక్యూరిటీ ఆఫీసర్ నజీర్

ధైర్యాన్ని కల్పిస్తున్నారు. అగ్రీ వర్సిటీలో సెక్యూరిటీగా పనిచేస్తున్న విక్రమ్ సతీమణి ఇటీవల గుండె పోటుతో మరణించినది. దీంతో సెక్యూరిటీ అధికారులు సిబ్బంది అంతా కలసి చందాలు వేసుకుని రూ.22 వేల రూపాయలను పోగుచేశారు. ఈ మొత్తాన్ని సెక్యూరిటీ ఆఫీసర్లు షేక్ నజీర్,సీ. యాదగిరి, ఆధ్వర్యంలో విక్రమ్ కు అందజేశారు. సెక్యూరిటీ సిబ్బంది అండగా ఉంటూ వారి దాతృత్వం చాటు కుంటున్నారు.

ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డ్ అసోసియేషన్ ప్రతినిధులు డి. సన్నీ, వై.నర్సింహా, ఎన్.రాము,ఏం.బాలయ్య, ఏం. హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## డేంజర్ జోన్‌లో ఖమ్మం

**(మొదటి పేజీ తరువాయి)**
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించారు. ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఆదివారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రానున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వారు అధికారులను ఆదేశించారు. వరద తీవ్రత పెరిగినా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆదివారం రాత్రి కలెక్టర్, సీపీ ముంపు కాలనీల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు ఎగువన ఉన్న మహబూబాబాద్, గార్ల, బయ్యారం మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది.

## తెలంగాణ ఉద్యమంలో ప్రజా కవి కాళోజీ స్ఫూర్తి

**(మొదటి పేజీ తరువాయి)**
రాష్ట్ర సాధన కోసం తాను బయలుదేరిన నాడు నిండు మనసుతో కాళోజీ దీవించారని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో కాళోజీ స్ఫూర్తి కొనసాగే దిశగా వారి జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు.
తెలంగాణ భాష, సాహిత్యాలలో విశేషంగా కృషి చేసిన వారికి కాళోజీ పురస్కారాన్ని ఏర్పాటు చేసుకొని సాహితీవేత్తలను గౌరవించుకుంటున్నాం అన్నారు. రాష్ట్ర వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ పేరు పెట్టుకున్నామని,వరంగల్లో కాళోజీ కళాకేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. కాళోజీ కవిత్వం,ఆలోచనలు అన్ని వేళలా ఆదర్శం అని కేసీఆర్ తెలిపారు.

## చెరువుల ఆక్రమణలపై హైడ్రా దూకుడు

**(మొదటి పేజీ తరువాయి)**
పదుల సంఖ్యలో షెడ్లు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. హైడ్రా అధికారులు చిన్న చిన్న షాపులు, హోటళ్లు కూలుస్తున్నారు. దీంతో వాటి యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. ముందస్తు నోటీసులు లేకుండా పడగొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. షెడ్లలో రూ.కోట్ల విలువైన సామగ్రి ఉందని.. తీసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సున్నం చెరువు వద్దకు స్థానికులు భారీగా చేరుకున్నారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రా దూకుడు కొనసాగుతోంది. హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, జిల్లాల పరిధిలో ఆక్రమణలు కూల్చివేస్తోంది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ కత్వా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా విల్లాలు నిర్మించినట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మల్లంపేట్‌లోని లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ విల్లాలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ.. కత్వా చెరువులో 20కిపైగా అనధికారిక విల్లాలను గుర్తించాం. ప్రస్తుతం 8 విల్లాలను కూలుస్తున్నాం. మిగిలిన విల్లాలను ఖాళీ చేయించి కూలుస్తాం. ఇరిగేషన్ శాఖ నిర్దేశిరచిన మార్కు ప్రకారం నోటీసులిచ్చి కూలుస్తామని వెల్లడించారు.
మరోవైపు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని హెచ్ఎంటీ కాలనీ, వాణీనగర్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సహాయంతో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి.

## నామకరణ మహెూత్సవ కార్యక్రమంలో హాజరైన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8(నమస్తే ఉదయం):**
కేటిదొడ్డి మండల కేంద్రంలోని వాల్మీకి మండలాధ్యక్షుడు టీచర్ గోవింద్ మనమవుడు నామకరణ మహెూత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ నక్క హన్మంతు , జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, చక్రధర్ రావు, ఉరుకుందు, వెంకటాపురం గోపి, యుగేందర్ గౌడ్, కొండన్న, మల్లేష్ గౌడ్, నక్కశేఖర్, తదితరులు పాల్గొన్ని చిన్నారికి మరియు తల్లిదండ్రులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతోను వర్ధిల్లాలని దీవించారు. అదే విధంగా కన్జూమర్ పోరం మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, నాయకులు పాల్గొన్ని చిన్నారిని ఆశీర్వదించారు. అదే విధంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు, నాయకులు పాల్గొన్ని చిన్నారిని ఆశీర్వదించారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**మేడ్చల్, సెప్టెంబర్8(నమస్తే ఉదయం):**
సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి కాంగ్రెసులో చేరుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో శామీర్ పెట్ కు చెందిన 150 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెసు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన టిఆర్ఎస్ నాయకులు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ పట్నం సునీతా మహేంధర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, తుంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, నాయకులు రవి ముదిరాజ్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన టిఆర్ఎస్ నాయకులు

## సంస్కరణలకు ఆజ్యం పోసిన మహా గురువు శ్రీ నారాయణ గురుదేవ్ : ఎమ్మెల్యే డాక్టర్ మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 8(నమస్తే ఉదయం):**
పూర్వం కులమతాల పట్టింపులు ఎక్కువగా ఉన్న సయంలోనే, ఒక మతం ఒక దేవుడు అనే నినాదంతో అందరినీ ఏకతాటి పై నడిపించి, దళితులకు ఆలయ ప్రవేశం కోసం కృషి చేసి, ఎన్నో సంస్కరణలకు ఆజ్యం పోసిన మహా గురువు శ్రీ నారాయణ గురుదేవ్ అని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కొనియాడారు. ఆదివారంశ్రీ నారాయణ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ నారాయణ విద్యా భవన్‌లో కేరళ వాసులు పవిత్రంగా భావించే శ్రీ నారాయణ గురుదేవ్ 178వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీ నారయణ గురుదేవ్ జయంతి వేడుకల్లో పాల్గొనడం మలయాళీ సోదర సోదరీమణులను కలుసుకోవడం, వారి సంప్రదాయాలు తెలుసుకోవడం సంతోషంగా ఉన్నదని అన్నారు, అదే విధంగా నాయరాయణ గురువు గురించి మాట్లాడుతూ... నారాయణ గురువు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.
ఈ కార్యక్రమంలో జగతి రాజు,సువర్ణ అనిల్ కిషోర్ విజయశాంతి కుమార్, పులిక్కలేదత్, రాఘవ చర్యలు పాల్గొన్నారు.



## వరద బాధిత ప్రాంతాల్లో కేంద్రమంత్రుల పర్యటన

**(మొదటి పేజీ తరువాయి)**
ఇక్కడ జరిగిన విపత్తుని దేశ విపత్తుగా తీసుకోవాలని కేంద్రాన్ని మంత్రి పొంగులేటి కోరారు. ఈ సమయంలో రాజకీయాలు ముఖ్యం కాదు, ప్రజలను కాపాడటమే ముఖ్యమని.. కేంద్ర ప్రభుత్వం చేయూత ఇస్తోందని వివరించారు. తెలంగాణ అంటే గతంలో లాగా ధనిక రాష్ట్రం కాదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి తెలియజేశామని చెప్పారు. విపత్తు మొదలైన రోజే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.
ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ శవాల మీద చిల్లర ఏరుకుంటోందని విమర్శలు చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతిపక్షం ప్రజలను ఆదుకోకుండా కూడా రాజకీయ లబ్ది కోసం పాకు లాడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణలు చేశారు.

## ఎవరుపడితే వారు జర్నలిస్ట్ అవతారం

(మొదటి పేజీ తరువాయి)
ఎదుటి వారు విలువలు దాటితే మేము దాటుతాం. అక్రిడిటేషన్ విషయంలో ఈసారి కచ్చితంగా నిబంధనలు ఉంటాయి. జర్నలిస్ట్‌లకు పార్లమెంటరీ పార్టీ వ్యవస్థలో చాలా గౌరవ మర్యాదలు ఉంటాయి. ఇక్కడ ఉన్న వారు ఎలా ఉన్నారో ఆలోచన చేయాలి. కొన్ని సందర్భాల్లో చిట్‌చాట్‌లను సైతం ఇంకొకలాగా రాస్తున్నారు. గతంలో గాంధీ భవన్‌లో సన్నిహితంగా మాట్లాడిన మాటలను రికార్డు చేసిన సందర్భాలు ఉన్నాయి.
అందుకోసమే జర్నలిస్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. ఆరోగ్య శ్రీ కార్డుల విషయంలో ఎవరికి ఎలాంటి అపోహాలు అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.సమాజంలో జర్నలిస్ట్‌ల సమస్యలను దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనాడే గుర్తించారని తెలిపారు. 11 వందలమంది జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషమని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కొంతమంది బాధ్యతగా వ్యవహరించడం లేదని అన్నారు. రాష్ట్ర విభజన లాంటి అంశాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు తమ ప్రభుత్వంలో త్వరగా పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాల స్వాధీన పత్రం అందచేస్తున్నామని అన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న దాని పరిష్కారానికి మాత్రమే తాము పని చేస్తామని తేల్చిచెప్పారు. వృత్తి పరమైన గౌరవాన్ని జర్నలిస్టులు పెంచుకోవాలని సూచించారు. ఇప్పటి రాజకీయాలపై సరైన అభిప్రాయం ప్రజల్లో లేదని అన్నారు.
రాజకీయాలు, రాజకీయ నాయకులు అన్న ప్రజల్లో చిన్నచూపు ఉందని తెలిపారు. కేవలం కుటుంబ సభ్యుల కోసం పని చేస్తారనే అపవాదు ప్రజల్లో ఉందని విమర్శించారు. గతంలో అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు లోపలికి వెళ్లే అవకాశం లేదని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంలోకి వెళ్లే అంశం దేవుడేరుగు అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సిద్ధాంత పరమైన అంశాల కోసం మాత్రమే అప్పట్లో రాజకీయ పార్టీలు, పత్రికలు పెట్టుకున్నాయని గుర్తుచేశారు. దీనికి నిదర్శనం కమ్యూనిస్టు పార్టీలని తెలిపారు. గత ప్రభుత్వంలో సెక్రటేరియట్‌కు ప్రజా ప్రతినిధులు కూడా వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. ఈరోజు జర్నలిస్ట్‌లు సైతం సచివాలయంలోకి వెళ్లవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొంతమంది జర్నలిస్ట్‌లు సెక్రటేరియట్‌లో అనవసర రాద్ధాంతం సృష్టిస్తున్నారని ఆరోపణలు చేశారు. అలాంటి జర్నలిస్ట్‌లకు విలువ లేదని స్పష్టం చేశారు. ఎవరిని చూసిన తాము యూట్యూబ్ జర్నలిస్టులమని అంటున్నారని... కొందరు ఇంకేదో జర్నలిస్టులమని చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇలాంటి వారిని కట్టడి చేయాల్సింది మీరేనని అన్నారు. అసలుసిసలు జర్నలిస్టులు ఎవరన్నది మీరే తేల్చండి అని అన్నారు.

## వరదల నుంచి కోలుకుంటున్న ప్రజలు

**(మొదటి పేజీ తరువాయి)**
ఇప్పుడిప్పుడే అటు మున్నేరు కాస్త శాంతించగా.. ఇటు ఖమ్మం నగర వాసులు కాస్త ఊపిరిపీల్చుకుంటున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకొచ్చారు. సామాన్య ప్రజలు మొదలుకుని సెలబ్రిటీలు, పలు రంగాల పెద్దలు ముందుకొచ్చి తమకు తోచినంత విరాళంగా ప్రకటించారు. వారు ప్రకటించిన సొమ్ము అంతా చెక్కులు, నేరుగా నగదు, ఆన్‌లైన్ రూపంలో ఇప్పటికే సీఎం సీఎం సహాయ నిధికి అందజేశారు. ఇక 'మేము సైతం' అంటూ తెలంగాణాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చి కొండంత సాయం చేసింది. భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం చేసింది. వరద బాధితుల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు.
కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా ఉన్నారు. వీరంతా తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులు సైతం తమ రెండు నెలలు జీతం ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించారు. కాంగ్రెస్ నేతలంతా.. సీఎం రేవంత్ రెడ్డి, కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిర్ణయం పట్ల సామాన్య ప్రజలు, వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఇక వరద బాధిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. మరోవైపు.. సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక సమీక్షలు, సమావేశాలు రద్దు చేసుకుని మరీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటున్నారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించగా.. ఆదివారం నాడు మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పర్యటించారు. వరద బాధితులను కేంద్రం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన వెంటనే పూర్తి నిధులు వస్తాయన్నారు. వరద సాయం విషయంలో కేంద్రానికి వివక్ష లేదని.. స్టేట్ డిజాస్టర్ నిధులతో వరద బాధితులను ఆదుకోవాలన్నారు.
మరోసారి తుఫాన్ ముప్పు పొంచి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కిషన్ రెడ్డి సూచించారు.



గణేష్ ఉత్సవాలలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ యాదవ్

## వినాయకుడి పూజలో పాల్గొన్న శేఖర యాదవ్

**శంషాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే ఉదయం):** నర్ఖూడ గ్రామంలోని వినాయక కాలనీలో ఏర్పాటు చేసిన గణనాధుడి విగ్రహం వద్ద శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద ఆదివారం కాలనీవాసులతో కలిసి ఘన నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, వినాయకుడి దీవెనలతో అకాల వర్షాల ముప్పు తప్పి ప్రకృతి ప్రశాంతంగా ఉండాలిని వినాయక చవితి వేడుకలు ఆ లంబోధరుడి ఆశీస్సులతో ప్రజలంతా సకల విఘ్నాలు తొలిగి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని. అకాల వర్షాలు తగ్గి ప్రకృతి ప్రశాంతంగా ఉండాలని భగవంతుని కోరినట్లు శేఖర్ యాదవ్ తెలిపారు.

## లంబోదారుడి సేవలో చంద్రారెడ్డి

**శంషాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే ఉదయం):** ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శంషాబాద్ మండల సీనియర్ నాయకుడు కోడిగంటి చంద్రారెడ్డి వినాయకుడి పూజలు నిర్వహించారు. శనివారం చిన్న గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆదిదేవుడు



వినాయకుడి ఆశీస్సులతో శంషాబాద్ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుతూ స్వామి వారి పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శంషాబాద్ ప్రాంతం దినదినాభివృద్ధి చెంది ఈ ప్రాంత ప్రజలు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో పురోగతి సాధించాలని కోరుతున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో కోడి గంటి యశోద చంద్ర రెడ్డి. ప్రశాంత్ రెడ్డి. హర్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదు

**- కొత్తకోట సీఐ రాంబాబు**

**కొత్తకోట,సెప్టెంబర్ 8( నమస్తే ఉదయం):** వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల దగ్గర నిమజ్జనం రోజున డీజే లకు అనుమతి లేదని కొత్తకోట సిఐ రాంబాబు అన్నారు. ఆదివారం కొత్తకోట పోలీస్ స్టేషన్లో డీజే ఓనర్లకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రాం బాబు మాట్లాడుతూ... హైకోర్టు ఉత్తర్వులు మేరకు కొత్తకోట పట్టణ, మండల పరిసర ప్రాంతాలలో వినాయక మండపాల దగ్గర



నిమజ్జనం రోజున డీజేల కు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి నా యెడల అట్టి వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామనిఅన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై మంజునాథ రెడ్డి, డీజే ఓనర్లు పాల్గొన్నారు.

## అప్పులు ఎక్కువై ఉరి వేసుకుని దాబా నిర్వాహకుడు మృతి

**కొత్తకోట, సెప్టెంబర్ 8 (నమస్తే ఉదయం):** రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బ్రిజేష్ కుమార్ 21 అనే యువకుడు కొత్తకోట మండలం అమడబాకుల గ్రామ శివారులోని బాలాజి మార్వాడి దాబా లీజుకు తీసుకొని నడిపేవారు. దాబా నడవక అప్పులు కావడంతో శనివారం అర్ధరాత్రి ఉరేసుకుని మృతి చెందినట్లు మృతుని మేనమామ దేవీలాల్ కుమావత్ పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు.






## వ్యవసాయ, అనుబంధ రంగాల విద్యార్థులకు మేలైన ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఆరో డీన్ కమిటీ సిఫార్సులు

**భారత వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ సి అగ్రవాల్**

**హైదరాబాద్, సెప్టెంబరు 8(నమస్తే ఉదయం):** వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విద్య అభ్యసించిన విద్యార్థులు, శిక్షణ పొందిన యువతకు మేలైన ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఆరో డీన్ కమిటీ సిఫార్సులు ఉన్నాయని, వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, స్టార్టప్ వాతావరణం కల్పించేందుకు అనుగుణంగా విద్యలో మార్పులు చేసినట్టు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ సి అగ్రవాల్ అన్నారు.

హైదరాబాదులోని కన్హ శాంతి వనంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6,7 తేదీలలో రెండు రోజులపాటు ఏర్పాటుచేసిన భారతీయ వ్యవసాయ వైస్ ఛాన్సర్‌ల జాతీయ సదస్సుకు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు నైపుణ్యత ఇంతగా పెంచుకుంటే ఉపాధి అవకాశాలు అంతగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు భవిష్యత్తులో వ్యవసాయ విద్య అభ్యసించిన వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలు పుష్కలంగా ఉంటాయని, వ్యవసాయ విద్యార్థులకు మేలైన ఉపాధి అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం ట్విన్ డిగ్రీలు, ద్యూయల్ డిగ్రీలు, జాయింట్ డిగ్రీలపై రూపొం దించిన మార్గదర్శకాలపై చర్చించారు. ఈ డిగ్రీలు ఇచ్చేందుకు విదేశీలలో నాణ్యమైన విద్యను అందించే విశ్వవిద్యాలయాలు, సంస్థలు స్వదేశీ విద్యాలయాలతో ఒప్పందం చేసుకోవాలని విశ్వ విద్యాలయాలను కోరారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ తో మేలైన పరిశోధన జరుగుతాయని, సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అలాగే, 2020 జాతీయ విద్యా విధానం సిఫార్సులను వ్యవసాయ విద్యలో చేరుస్తామని డాక్టర్ ఆర్ సి అగర్వాల్ పేర్కొన్న అన్నారు.

మెడిటేషన్‌తో చదువులలో గ్రాహ్యత బాగా పెరిగి విద్యార్థులు బాగా రాణిస్తారని హార్ట్ ఫుల్ నెస్ గ్లోబల్ గైడ్, శ్రీ రామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజి అన్నారు. రెండవ రోజు సదస్సులో సర్టిఫికెట్ కోర్సులు, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ ప్రోగ్రాంపై మార్గదర్శకాలు, జాతీయ విద్యా విధానం, ద్యూయల్ డిగ్రీస్, జాయింట్ డిగ్రీస్ పైన చర్చించిన అంశాలను క్రోడీకరించారు.

మెడిటేషన్ పై విద్యార్థులకు సాధ్యమైనంత తరచుగా శిక్షణ ఇస్తున్నట్లు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ బి.నీరజా ప్రభాకర్ పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పర్విందర్ కౌశల్ సైతం మాట్లాడారు.

ఈ జాతీయ సదస్సులో 50 మందికి పైగా వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సర్లు, వర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నిపుణులు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడు ఆశీస్సులతో ప్రజలు స్వచ్ఛంగా ఉండాలి: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గజానన మహోత్సవంలో భాగంగా గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8(నమస్తే ఉదయం):** విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వరకు ఉన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని 32వ వార్డు చింతల పేట ధర్మ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన, శ్రీ ఆంజనేయులు స్వామి దేవాలయం, చిన్న పిల్లల్లో నందు ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవాల్లో పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తో కలిసి హాజరయ్యారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి నాయకులు ధర్మ నాయుడు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గజానన మహోత్సవంలో భాగంగా గణపతి మండపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమెహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగినది.

ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ...

ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ప్రతి సంవత్సరం జరుపుకోవాలి మట్టి వినాయకుడిని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలని అని తెలిపారు. గణేష్ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర గద్వాల నియోజక వర్గంలో రైతులకు, దినదిన అభివృద్ధి అభివృద్ధి చెందాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా స్వామి వారి కోరుకొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ పూడూరు కృష్ణ , నాయకులు గోవిందు, భగీరథ వంశీ, కురుమన్న, నర్సింహులు, రామాంజనేయులు, దౌలన్న, లక్ష్మన్న పవన్ యాదవ్, మోనిన్, వీరేష్, రామచందర్, పరశురాముడు, రామకృష్ణ, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చింతల్ పేటలో నెలకొల్పిన విఘ్నేశ్వరుడుకి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జి వేణుగోపాల్





అత్తాపూర్ పోచమ్మ దేవాలయం ఆవరణలో కొలువు దీరిన బడా గణేష్, రక్త దానం చేస్తున్న యువకులు

## వినాయక చవితి సంధర్భంగా అత్తాపూర్ "న్యూ స్టార్స్ భక్త సమాజ్" కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రక్తదానం

**రాజేంద్ర నగర్, సెప్టెంబర్8(నమస్తే ఉదయం):** గణేష్ చతుర్థి సందర్భంగా అత్తాపూర్ పోచమ్మ దేవాలయం ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయకుని మండపంలో శనివారం రక్తదానం నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానంగా భావించి "న్యూ స్టార్స్ భక్త సమాజ్" కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి రక్తం దానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

100 మందికి పైగా ఈ రక్తదాన కార్యక్రమ లో పాల్గొని రక్త దానం చేశారు. బాలానగర్‌కు చెందిన బీబీఆర్ బ్లడ్ బ్యాంకు డాకర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అత్తాపూర్‌లోని గణేష్ నవరాత్రులు జరుపుకుంటే ముందుగా గుర్తుకు వచ్చేది అత్తాపూర్ పోచమ్మ గుడి వద్ద ఉన్న న్యూ స్టార్స్ భక్త సమాజ్ గణేష్. ఈ ఏడాది 28 ఏళ్ళ వసంతాల సందర్భంగా.. ఈ ఏడాది 20 అడుగుల ఎత్తులో బడా గణేష్ కొలువుదీరాడు.

అలాగే ఈసారి అత్తాపూర్‌లో గణేష్ దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వారి కోసం ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గణేష్ కమిటీ సభ్యులు పూజలు ఘనంగా నిర్వహించారు. మహా గణపతి పూజకు కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

పది రోజుల పాటు మహా గణపతి భక్తుల పూజలు అందుకున్న మీదట ఈ నెల 17 వ తేదీన ఘనంగా నిమజ్జన వేడుక జరుగనుంది.

వాటి కోసం ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతిరోజు చెక్కభజనలు, కీర్తనలు, మేళ తాళాలతో అంగరంగ వైభవంగా లడ్డు వేలం పాట, అన్నదానం, పిల్లలకు కల్చరల్ ప్రోగ్రామ్స్, మరెన్నో కార్యక్రమాలను జరుపుకుంటారు.

# వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేసిన శేఖర్ కమ్ముల 'కుబేర' టీం

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, నేషనల్-అవార్డ్-విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ కుబేర.

లీడ్ రోల్స్ తో సహా రష్మిక మందన్న పాత్రని పరిచయం చేసిన పోస్టర్లు, గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ధనుష్, నాగార్జున కనిపించిన ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా యూనిట్ వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ పోస్టర్ ధనుష్, నాగార్జున పోషించిన పాత్రల మధ్య ఉన్న డిఫరెన్స్ చూపిస్తుంది. ధనుష్ పాత్ర మ్యాసీ హెయిర్, గుబురు గడ్డంతో కనిపించగా, నాగార్జున లుక్ మోడరన్ అవుట్ ఫిట్స్ లో స్టయిలిష్ అవతార్ లో కనిపించారు. ఈ పోస్టర్ సినిమా థీం కోర్ ని ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



# 'గేమ్ ఛేంజర్' సెకండ్ సింగిల్ అప్‌డేట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' మీదున్న అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. 2024 క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. మూవీ నుంచి ఇప్పటికే వదిలిన పోస్టర్స్, 'జరగండి జరగండి..' సాంగ్, వస్తోన్న అప్డేట్లతో గేమ్ ఛేంజర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వినాయక చవితి సందర్భంగా ఈ మూవీ నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సెప్టెంబర్ నెలలో సినిమా నుంచి మరో సాంగ్‌కి సంబంధించిన అప్డేట్ ఇవ్వబోతున్నట్లు మేకర్స్ తెలియజేశారు.

ఇప్పటికే 'గేమ్ చేంజర్' నుంచి తమన్ సంగీత సారథ్యంలో వచ్చిన 'జరగండి జరగండి..' పాట ఎంత సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. తాజాగా వినాయక చవితికి ఇచ్చిన అప్‌డేట్ పోస్టర్, అందులోని న్యూస్ అభిమానులు సహా అందరిలోనూ మరింత ఉత్సాహాన్ని నింపేలా ఉంది. పోస్టర్‌ను గమనిస్తే.. తలకు ఎర్రటి టవల్ చుట్టుకుని స్టైలిష్ అవతార్‌లో కనిపిస్తున్నారు రామ్ చరణ్. ఆయన బ్యాగ్రౌండ్‌ను గమనిస్తే.. ఉత్సవంలో వేషధారణ చేసుకున్నట్లు ఉండేలా కొందరు ఉన్నారు. అందరూ




# 'మత్తు వదలరా 2' ఎంటర్‌టైనింగ్ ట్రైలర్



బ్లాక్‌బస్టర్ మత్తు వదలారకు సీక్వెల్ 'మత్తు వదలరా 2' హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. శ్రీ సింహ కోడూరి, సత్య లీడ్ రోల్స్ లో రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్, టీజర్, ప్రమోషనల్ సాంగ్ ప్రతి ప్రమోషన్ మెటీరియల్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ రోజు రెబల్ స్టార్ ప్రభాస్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

హెచ్‌ఈ టీమ్‌లో స్పెషల్ ఏజెంట్లుగా పనిచేస్తున్న శ్రీ సింహ, సత్య, వారు పట్టుకున్న కిడ్నాపర్‌ల నుండి డబ్బును గుంజుతుంటారు. అనుకోకుండా జరిగిన ఓ మర్డర్ తో వారి జీవితం మలుపు తిరుగుతుంది. , స్పెషల్ టీం వారిని కోల్డ్ బ్లడెడ్ మర్డర్స్ గా నమ్మి వెంటపడుతుంది. దర్శకుడు రితేష్ రానా సీక్వెల్ కోసం మరొక అద్భుతమైన నేపథ్యాన్ని ఎంచుకున్నాడు, ప్రతి పాత్ర కీ రోల్ ప్లే చేస్తుంది. నెరేటివ్ రేసీ అండ్ క్రేజీగా ఉంటుంది. స్లేవ్ డ్రగ్ కాన్సెప్ట్ యూనిక్ టర్న్ ని యాడ్ చేస్తోంది. ముఖ్యంగా, టీవీ సీరియల్ ఎపిసోడ్‌లు హిలేరియస్‌గా అలరించింది.



# '35-చిన్న కథ కాదు' సక్సెస్ చాలా తృప్తిని ఇచ్చింది: హీరో రానా దగ్గుబాటి

నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన ఫీల్ గుడ్, హెూల్సమ్ ఎంటర్‌టైనర్."35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. సెప్టెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా హార్ట్ టచ్చింగ్ ఎమోషన్స్, హెూల్సమ్ ఎంటర్ టైన్ తో అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్యూటీఫుల్ బ్లాక్ బస్టర్ హిట్‌అందుకుంది. ఈ సందర్భంగా మూవీ టీం థాంక్స్ మీట్ ని నిర్వహించింది. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. 35-చిన్న కథ కాదు' సక్సెస్ చాలా తృప్తిని ఇచ్చింది. నివేద థామస్ అద్భుతంగా నటించింది. పెర్ఫార్మెన్స్ తో ఆశ్చర్యపరిచి తన భుజాలపై సినిమాని ముందుకు తీసుకెళ్ళింది. తనతో వర్క్ చేయడం హానర్ గా వుంది. సురేష్ ప్రొడక్షన్ పిట్టగోడ ద్వారానే విశ్వదేవ్ లాంచ్ అయ్యాడు. 35లో తన నటన సర్ ప్రైజ్ చేసింది. మంచి కథలు చేయాలనే తపన తనని ఇంకా ముందుకు తీసుకెళుతుంది. మీడియా కి థాంక్ యూ. ఈ సినిమాకి మీరు ఇచ్చిన స్టార్స్ నేనెప్పుడూ చూడలేదు. చాలా సంవత్సరాల తర్వాత కిడ్స్, ఫ్యామిలీస్ ని థియేటర్స్ లో హౌస్ ఫుల్ గా చూడటం చాలా ఆనందంగా వుంది. దర్శకుడు నందు వలనే ఇది సాధ్యమైయింది. తనలోని ప్యూర్ ఎనర్జీ ఈ సినిమాలో కనిపించింది. సినిమాని ఆదరిస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్ యూ. ఈ సక్సెస్ జర్నీ ఇక్కడ నుంచి స్టార్ట్ అవుతుంది. ఇలాంటి మంచి కథలు ఎప్పుడూ మీ ముందుకు తెస్తూనే వుంటాం' అన్నారు.

# సెప్టెంబర్ 9న 'వేట్టైయాన్' లిరికల్ సాంగ్

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా భారీ బడ్జెట్ చిత్రాలను రూపొందిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్'. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. సామాజిక పరమైన సమస్యలను తెలియజేసేలా సినిమాలు చేస్తూ విమర్శకుల ప్రశంసలను అందుకున్న దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ కాంబోలో రాబోతున్న ఈ పాన్ ఇండియ మూవీ ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. బ్లాక్ బస్టర్ చిత్రాలు 2.0, దర్బార్, లాల్ సలామ్ వంటి చిత్రాల తర్వాత రజినీకాంత్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో రాబోతున్న నాలుగో సినిమా 'వేట్టైయాన్'.

వేట్టైయాన్ ప్రమోషన్స్‌లో వేగం పుంజుకుంది. అందులో భాగంగా ఈ సినిమా నుంచి తొలి పాటను మేకర్స్ విడుదల చేయటానికి సిద్ధమయ్యారు. పేట, దర్బార్, జైలర్ చిత్రాల తర్వాత రజినీకాంత్, రాక్ స్టార్ అనిరుద్ రవిచందర్ కలయికలోనూ రానున్న నాలుగో సినిమా కూడా ఇదే కావటం విశేషం. సూపర్ స్టార్ ఇమేజ్‌కు తగ్గట్టు ఆయన అభిమానులు సహా అందరినీ దృష్టిలో పెట్టుకుని అనిరుధ్ మరోసారి తనదైన పంథాలో బాణీలను అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెప్టెంబర్ 9న 'మనసిలాయో..' అనే పాటను విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ప్రతీ అనౌన్స్‌మెంట్‌కి సినిమాపై భారీ అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి.



# మోగ్లీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్


పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్ వినాయక చతుర్థి శుభ సందర్భంగా ఎక్సయిటింగ్ న్యూ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు.

తన తొలి చిత్రం కలర్ ఫోటో తో జాతీయ అవార్డును గెలుచుకున్న దర్శకుడు సందీప్ రాజ్, ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో లవ్ స్టోరీ కోసం యంగ్ ట్యాలెంటెడ్ రోషన్ కనకాలతో కలిసి పని చేయబోతున్నారు.

యంగ్ నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సందీప్ రాజ్, ఈ సినిమా కోసం మరోక అద్భుతమైన కథను రెడీ చేశారు.

రోషన్ కనకాల, తన పెర్ఫార్మెన్స్, డ్యాన్స్ లతో ప్రశంసలు అందుకున్నారు. మోగ్లీ పేరుతో రాబోతున్న ఈ చిత్రంలో యూనిక్ రోల్ లో కనిపించనున్నారు. రోషన్ కనకాల వెస్ట్ ధరించి, సాలిడ్ ఫిజిక్, దట్టమైన అడవిలో గుర్రంతో పాటు చిరునవ్వుతో కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ అదిరిపోయింది.

విజువల్‌గా పోస్టర్ కట్టిపడేసింది.





# తగ్గక తప్పట్లేదు!

పూజా హెగ్డే.. సౌత్ ఇండియాలో మొన్నటి వరకు ఒక రేంజ్ లో బిగ్ ప్రాజెక్టులను సొంతం చేసుకుంటూ వెళ్ళింది. కానీ అమ్మడి బ్యాడ్ లక్ ఏమిటో గాని చేసిన పెద్ద సినిమాలన్నీ దెబ్బ కొట్టాయి. కెరీర్ మొదటి నుంచి కూడా పూజ పాపతో లక్కు దోబూచులాడుతోంది. 2012లో మూగమూడి అనే తమిళ్ సినిమాతో పూజా హెగ్డే హీరోయిన్ గా కెరియర్ ప్రారంభించింది. ఆ సినిమా వచ్చిన రెండేళ్ల తర్వాత తెలుగులోకి ఒక లైలా కోసం సినిమాతో అడుగుపెట్టింది. ఈ చిత్రంలో నాగ చైతన్యకి జోడీగా పూజా హెగ్డే నటించింది. నెక్స్ట్ ముకుంద సినిమాలో వరుణ్ తేజ్ తో జతకట్టింది. పూజా హెగ్డే మొదటి మూడు సినిమాలు సౌత్ లో పెద్దగా సక్సెస్ కాలేదు. హిందీలోకి మోహింజదారో సినిమాతో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఆ సినిమాలో హృతిక్ రోషన్ కి జోడీగా పూజా హెగ్డే నటించింది. ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. మరల దువ్వాడ జగన్నాథమ్ సినిమాతో టాలీవుడ్ లోకి వచ్చిన పూజా మొదటి కమర్షియల్ హిట్ అందుకుంది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా జెట్ స్పీడ్ తో పూజా హెగ్డే కెరియర్ కొనసాగింది.

2022లో పూజా హెగ్డే నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. వీటిలో ప్రభాస్ రాధేశ్యామ్ కూడా ఉండటం విశేషం. అయితే ఈ నాలుగు సినిమాలలో మూడు డిజాస్టర్ అయ్యాయి. బీస్ట్ మూవీ మాత్రం యావరేజ్ టాక్ తెచ్చుకుంది. 2023లో బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ కి జోడీగా నటించిన కిసీకా భాయ్ కిసీకి జాన్ మూవీ రిలీజ్ అయ్యి డిజాస్టర్ అయ్యింది. అదే సమయంలో గుంటూరు కారంతో పాటు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలలో ఛాన్స్ లని పోగొట్టుకుంది. ప్రస్తుతం ఆమె కెరియర్ చెప్పుకోదగ్గ స్పీడ్ లో లేదు. తమిళంలో సూర్యకి జోడీగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో నటిస్తోంది. చేతిలో సినిమాలు లేకపోవడం, ఆశించిన స్థాయిలో సక్సెస్ లు రాకపోవడంతో పూజా హెగ్డే రెమ్యునరేషన్ తగ్గించేసిందంట. గత ఏడాది వరకు కోటి రూపాయిలకి పైగానే రెమ్యునరేషన్ తీసుకున్న పూజా హెగ్డే ఇప్పుడు కోటి కంటే చాలా తక్కువగానే తీసుకుంటుందంట. హిందీలో షాహిద్ కపూర్‌కి జోడీగా దేవ్ అనే సినిమాని పూజా హెగ్డే కంప్లీట్ చేసింది.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733